

బుధవారం । 8 । మార్చి । 2023

న్యూస్‌రీల్

సీఆర్‌పీఎఫ్ బ్యారెక్ సందర్శన



మక్కువ సీఆర్‌పీఎఫ్ బ్యారెక్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

మక్కువ: మక్కువ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉన్న సీఆర్‌ఎఫ్ బ్యారెక్‌ను ఎస్పీ విద్యాసాగర్ నాయుడు మంగళవారం సందర్శించారు. సీఆర్‌పీఎఫ్ బలగాలు నివసిస్తున్న క్వార్టర్స్‌ను పరిశీలించారు. శిథిలావస్థకు చేరుకున్న భవనాల మరమ్మతులపై అధికారులకు సూచనలిచ్చారు. మక్కువ పోలీస్‌స్టేషన్ ఏవోబీకు సమీపంలో ఉన్నందున బలగాలు అప్రమత్తంగా ఉండాలన్నారు. స్థానిక పోలీసులతో సమన్వయం చేసుకుంటూ విధులు చేపట్టాలన్నారు. ఆయన వెంట అడిషనల్ ఎస్పీ దిలీప్‌కిరణ్, సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ అశుకుమారి, సీఐ ధనంజయరావు, ఎస్‌ఐ జి.పైడిరాజు పాల్గొన్నారు.

స్కిల్‌హబ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట: స్థానిక ప్రభుత్వ ఐటీఐలోని స్కిల్ హబ్‌లో శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్ తెలిపారు. జనరల్ ప్లంబర్, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, ఫోర్‌వీలర్ సర్వీస్ టెక్నీషియన్, స్వీయింగ్ మెషిన్ ఆపరేటర్ విభాగాల్లో శిక్షణ ఇస్తామన్నారు. ఈ కోర్సులకు 7 నుంచి పదోతరగతి వరకు చదివిన నిరుద్యోగ యువతీ, యువకులు అర్హులన్నారు. ఉచిత శిక్షణతో పాటు ఉద్యోగం కల్పిస్తామని చెప్పారు. వివరాలకు సెల్:70320 60773, 91823 98325 నంబర్లను సంప్రదించాలన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు, జిల్లా అటవీశాఖాధికారి ప్రసూన

పార్వతీపురంటౌన్: ఏనుగు దాడిలో బలిజిపేట మండలం మిర్తి వలస గ్రామానికి చెందిన అడపా దేశినాయుడు మృతిచెందిన విషయం తెలిసిందే. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి మంజూరైన 2.5లక్షల ఆర్థిక సహాయాన్ని జిల్లా అటవీశాఖాధికారి ప్రసూన, ఎమ్మెల్యే అలజంగి జోగారావు మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మృతుడి తండ్రి లక్ష్మునాయుడుకు అందజేశారు. మిగిలిన సహాయాన్ని కూడా త్వరలో అందిస్తామని ప్రకటించారు. గిరిజనులు సాగు చేస్తున్న పొడు భూములకు ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు మంజూరు చేయడంలో ఉన్న సమస్యలను తొలగించి సత్వరమే వారికి పట్టాల మంజూరుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు జిల్లా అటవీ శాఖ అధికారి ప్రసూనను కోరారు.

ఆస్పత్రి ప్రసవాలు సురక్షితం

- జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు



కుసలో గర్భిణిని పరీక్షిస్తున్న డీఐఓ జగన్మోహనరావు

గుమ్మలక్ష్మీపురం: గర్భిణులు ప్రసవ తేదీకి ముందుగానే నిర్దేశించిన ఆస్పత్రిలో చేరితే తల్లీ బిడ్డలకు మెరుగైన వైద్యం అందుతుందని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి (డీఐఓ) డాక్టర్ టి.జగన్మోహనరావు తెలిపారు. మండలంలోని దుడ్డుఖల్లు, రేగిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని కుస, దేరువాడ, కొత్తవలస, లోవలక్ష్మీపురం, గోరడ, రేగిడి, దుడ్డుఖల్లు గ్రామాల్లో ఆయన మంగళవారం పర్యటించారు. గర్భిణులు, హైరిస్క్ గర్భిణులు, బాలింతలు, శిశువుల ఇళ్లకు వెళ్లి వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన మందులు అందజేశారు. దుడ్డుఖల్లు, రేగిడిలోని ఆశ్రమ పాఠశాలలను సందర్శించి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆయనవెంట వైద్యాధికారులు బి.స్వాతి, ఎం.శంకర్ ఉన్నారు.

శ్రమైక జీవన సౌందర్యం



- పోడు సాగులో 'ఆమె'
- బతుకుబండిని నడపడంలో ప్రధాన భూమిక
- పంటల సాగు నిర్ణయించేది మహిళలే..
- అటవీ ఫలసాయాల సేకరణ, గ్రేడింగ్‌లో కీలక బాధ్యతలు
- విత్తనాలు సిద్ధం చేయడం నుంచి పంట విక్రయం వరకు 'ఆమె'దే తుది నిర్ణయం
- మన్యంలో మహిళా రైతుల శ్రమైక జీవనం
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

విశాలమైన అటవీ ప్రాంతమే వారి అవాసం. కొండవాలే వారి పంట పొలం. వ్యవసాయం, అటవీ ఫలాల సేకరణే జీవనాధారం. కోడి కూయకముందే కలిసికట్టుగా అడవిబాట పడతారు. రాళ్ల భూమిని సాగుభూమిగా మలుస్తారు. విత్తనం నుంచి పంట విక్రయం వరకు బాధ్యతగా 'సాగు'తారు. బతుకు బండిని ముందుకు నడిపించడంలో ప్రధాన భూమిక పోషిస్తారు. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గిరిజన మహిళల శ్రమైక జీవన సౌందర్యంపై 'సాక్షి' అక్షర రూపం.

వన్‌ధన్ కేంద్రాలతో వికాసం..

పార్వతీపురం మన్యం జిల్లాలో 86 జన్‌ధన్ వికాస కేంద్రాలున్నాయి. వీటి ద్వారా సుమారు 16,200 మంది ఉపాధి పొందుతుండగా, 15,800 మంది గిరిజన మహిళలే. తమ వద్ద లభ్యమయ్యే అటవీ ఉత్పత్తులను వన్‌ధన్ వికాస కేంద్రాలకు చేర్చుతున్నారు. ప్రాసెసింగ్ చేసి మార్కెట్‌లో గిట్టుబాటు ధరకు విక్రయిస్తున్నారు. వికాస కేంద్రాలను నడపడంలో మహిళలు పట్టుసాధించారు. ప్రస్తుత సీజన్‌లో పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల పరిధిలో సుమారు రూ.15లక్షల విలువైన పసుపు, చింతపండు, కొండచీపుర్ల వ్యాపారం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. చిరుధాన్యాలతో బిస్కెట్స్, ఇతర ఆర్గానిక్ ఫుడ్స్ యూనిట్ల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం అందజేస్తున్న వ్యవసాయ రాయితీలు, రుణాలను గిరిజన మహిళలు సద్వినియోగం చేసుకుని, ఆర్థికంగా ఎదుగుతున్నారు.



పార్వతీపురం వన్‌ధన్ వికాస కేంద్రంలో చింతపండును ప్యాకింగ్ చేస్తున్న మహిళ

విజయనగరం డెస్క్: కనుచూపు మేర విస్తరించిన దట్టమైన అడవులు.. మధ్యమధ్యలో పచ్చని కొండలు.. వాటిపై విసిరేసినట్టుగా ఉండే గిరిజన గూడలు.. అక్కడకు వెళ్లేవారికి దారిపొడవుగా గిరిజనుల జీవన విధానం కళ్లకు కడుతుంది. వారు నివసించే తీరు అబ్బురపరుస్తుంది. అక్కడి మహిళల శ్రమైక జీవనం ముచ్చటగొల్పుతుంది. మహిళలందరూ వేకువ జామునే మేల్కొంటారు. చకచకా వంట, ఇంటి పనులు పూర్తిచేస్తారు. చల్దన్నం మూటకట్టుకుని అడవి కోడి కూయకముందే కలిసికట్టుగా కొండపోడుకు బయలుదేరుతారు. పంటల సాగులో శ్రమిస్తారు. అటవీ ఉత్పత్తుల సేకరణలో నిమగ్నమవుతారు. వారంపూట జరిగే సంతకు తరలించేందుకు పంటలను సిద్ధం చేస్తారు. గూడగూడంతా ఒకేసారి వ్యవసాయ ఉత్పత్తులను మోసుకుంటూ రాళ్లదారిలో సంతకు చేరుకుంటారు. వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించి ఇంటికి కావాల్సిన సరుకులను కొనుగోలు చేస్తారు. ఇదీ గిరిజన మహిళల దినచర్య.

సాగులో ఆమెదే తుది నిర్ణయం

పోడు సాగులో పురుషులు కంటే మహిళల పాత్రే ఎక్కువ. పురుషులు చెట్లు కొట్టడం.. దుక్కిచేయడం వంటి పనులకే పరిమితమవుతారు. కొన్నిచోట్ల ఈ పనులుకూడా మహిళలు చేస్తున్నారు. భూమిని సాగు యోగ్యంగా మలచడం, విత్తనాలు విత్తడం, కలుపుతీత, పంటకోత, మార్కెట్‌కు పంటలు తరలించడంలో మహిళే అధికంగా శ్రమిస్తారు. గిరిజన గూడల్లో సహకార వ్యవసాయం అమలులో ఉంది. అందుకే కూలి చెల్లింపులు వంటివి అంతగా కనిపించవు. మహిళలందరూ ఒక్కటిగా ముందుకు సాగుతూ వ్యవసాయ పనులు చక్కబెడతారు. ఉన్నదాంతో ఆనందంగా జీవిస్తారు.



గుమ్మలక్ష్మీపురం మండలం పుసాబడిలో కొండపోడు పనులు చేస్తున్న గిరిజన మహిళలు



సీతంపేట వారపు సంతలో అరటిగెలలు విక్రయిస్తున్న గిరిజన మహిళలు

సీజన్‌తో 'సాగు'తూ...

మహిళా రైతులందరూ ప్రకృతితో మమేకమవుతారు. ఏ కాలంలో ఏ పంట వేయాలి.. ఎప్పుడు చేతికందుతుంది.. ఏ పంట వేస్తే అధిక దిగుబడి వస్తుందన్న విషయాలపై అవగాహనతో ఉంటారు. వారిని ప్రశ్నిస్తే సీజన్ల వారీగా లభించే పంటలను కంఠస్థంగా చెబుతారు. పంటల సాగులో రుతువులను అనుసరిస్తారు. పసుపు ఉడకబెట్టడం, చింతపండు సేకరణ, మార్కెట్‌లో విక్రయించేందుకు సిద్ధం చేయడం, కొండచీపుర్లు, అటవీఫలసాయాల సేకరణలో గిరిజన మహిళలే ఎక్కువగా శ్రమిస్తారు.

సూచనలు పాటిస్తూనే...

ఇటీవల కాలంలో వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు ఇస్తున్న సాగుసూచనలను మహిళా రైతులు అనుసరిస్తున్నారు. పంటమార్పిడి విధానం పాటిస్తున్నారు. రాగులు, కొర్రలు, గంటిలు, జొన్నలు, సామలు వంటి చిరుధాన్యాలను సాగుచేస్తున్నారు. చిరుధాన్యాల సాగులో రసాయనిక ఎరువులను వినియోగించరు. సీజన్‌వారీగా విత్తడం వల్ల ఎరువులు అవసరం లేకుండానే అధిక దిగుబడులు వస్తాయని మహిళా రైతులు చెబుతున్నారు.

పోడు సాగే ఆధారం



పోడుసాగే మాకు ఆధారం. మహిళలందరం ఉదయం నుంచి పొద్దుపోయేవరకు కష్టపడతాం. ఉన్నదాంతోనే సంతృప్తిపడతాం. పోడు వ్యవసాయం చేస్తూనే కుమారుడిని డిగ్రీవరకు చదివించాను.

– సవర జమ్మతమ్మ, రాజన్నగూడ

పార్వతీపురం మన్యం జిల్లాలో మొత్తం గ్రామాలు	గిరిజన గ్రామాల సంఖ్య (సుమారుగా)	గిరిజన గ్రామాల జనాభా:	మహిళలు:	పోడుసాగులో నిమగ్నమైన మహిళలు:
971	600	2 లక్షల 60 వేలు	లక్షా 33 వేలు	70 వేల మంది

పదోతరగతి పరీక్షల నిర్వహణకు పక్కా ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ ఆనంద్

- ఏప్రిల్ 3 తేదీ నుంచి 18 వరకు పదోతరగతి పరీక్షలు

పార్వతీపురం: వచ్చేనెల 3 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్న పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా ఏర్పాట్లు చేయాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ఒ.ఆనంద్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పదోతరగతి పరీక్షలు నిర్వహణ, ఏర్పాట్లపై అధికారులతో మంగళవారం సమీక్షించారు. జిల్లా ఆవిర్భావం తరువాత తొలిసారిగా ఈ ఏడాది 64 కేంద్రాల్లో పదోతరగతి పరీక్షలు జరుగుతాయని చెప్పారు. మొత్తం 10,784 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని, వీరిలో రెగ్యులర్ బాలురు 5,272 మంది, బాలికలు 5442 మంది, ప్రైవేట్ విద్యార్థులు 70 మంది ఉన్నారన్నారు. పరీక్షల నిర్వహణ సమాచారం అందించేందుకు కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని డీఆర్వో జె.వెంకటరావు సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేయనున్న తాత్కాలిక స్ట్రాంగ్‌రూమ్ నుంచి ఆయా కేంద్రాలకు ప్రశ్నపత్రాలను తరలించేందుకు భద్రతాఏర్పాట్లు చేయాలన్నారు. పరీక్షలు ముగిసిన తరువాత జవాబు పత్రాలను ఏ రోజుకు ఆరోజు పోస్టాఫీస్‌లో డిపాజిట్ చేయాలని పోస్టల్ సహాయ సూపరింటెండెట్ జి.వి.రమణను ఆదేశించారు. ప్రశ్న పత్రాలను కేంద్రాలకు చేర్చేందుకు రవాణా సౌకర్యం కల్పించాలని రవాణాశాఖ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జి.సత్యనారాయణకు సూచించారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా బస్‌సర్వీసులు నడపాలని ప్రజారవాణాశాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఈఓ ఎస్‌డీవీ రమణ, డీఎస్పీ సుభాష్, పార్వతీపురం, పాలకొండ ఉప విద్యాశాఖాధికారులు బ్రహ్మాజీ, విజయకుమారి, పోస్టల్ సహాయ సూపరింటెండెంట్ జి.వి.రమణ, ఆర్టీసీ డీపీటీఓ టీవీఎస్ సుధాకర్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జి.సత్యనారాయణ, ఎంపీహెచ్‌ఓ ఎల్.సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

దమ్మున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి

- రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య
- ఉమ్మడి విశాఖ జిల్లా కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి
- ఘనంగా శిష్టకరణాల సంఘీభావ సభ



శిష్టకరణాల సంఘీభావ సభలో మాట్లాడుతున్న వైవి సుబ్బారెడ్డి

గోపాలపట్నం: దమ్మున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, టీటీడీ పాలక మండలి చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. గోపాలపట్నం కుమారి కల్యాణ మండపంలో శిష్టకరణాల సంఘీభావ సభ ఘనంగా నిర్వహించారు. కృష్ణయ్య మాట్లాడుతూ శిష్ట కరణాలు రాజులకు పాఠాలు చెప్పేవారు.. ప్రజలకు మేలు చేసే శాసనాలు తయారు చేసే వారిగా కీర్తి గడించాలన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు శిష్టకరణాలను బీసీల్లో చేర్పించామని తెలిపారు. ఆ బాధ్యత వైఎస్సార్ తనకే అప్పగించారని పేర్కొన్నారు. ఇపుడు ఆయన తనయుడు బీసీలను రాజకీయంగా, ఆర్థికంగా బలోపేతం చేయడానికి నిస్వార్థంగా పని చేస్తున్నారని తెలిపారు. శిష్టకరణాలకు ఓబీసీ కేటగిరిలో చేర్పించేందుకు తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ అంశం కేంద్ర ప్రభుత్వంలో ఉందని దీని కోసం ఛలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిద్దామని ఓబీసీల్లో శిష్టకరణాలను చేర్పిద్దామన్నారు. విజన్ ఉన్న నాయకుడు బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి అయిన సీతంరాజు సుధాకర్‌కు మద్దతివ్వాలని కోరారు. రాబోయే రోజుల్లో శిష్టకరణాల సమస్యలు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఉత్తరాంధ్రను పరిపాలన రాజధాని చేసేందుకు కృషి చేస్తున్న ముఖ్యమంత్రికి ఎమ్మెల్సీ గెలిపించి కానుకగా ఇవ్వాలని కోరారు. వరుస సంఖ్య 3లో ఉన్న సీతంరాజు సుధారక్ పేరు ఎదురుగా 1వ నంబర్ అంకె వేయాలని కోరారు. జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శిష్టకరణాల కార్పొరేషన్ చైర్‌పర్సన్ అనుషాపట్నాయక్, బీసీ కార్పొరేషన్ సభ్యుడు పక్కి దివాకర్, శిష్టకరణాల సంఘం జాతీయ అధ్యక్షుడు డీవీ కృష్ణారావు, రాష్ట్ర అధ్యక్షుడు పోలు మహంతి ఉమామహేశ్వరరావు, డబ్బీరు వెంకటరావు, బీఆర్‌ఎం పాత్రో, బి. హరి బాబు, డి. చంద్రమౌళి, కుప్పిలి గణేష్, వైటపల్లి గోవిందు పాల్గొన్నారు.

మహిళలకు అండగా జగన్‌మోహన్‌రెడ్డి

- డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర
- అంతర్జాతీయ మహిళాదినోత్సవ శుభాకాంక్షలు



సాలూరు: మహిళలకు ఓ సోదరుడిలా, ఓ పెద్దకొడుకులా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారని ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. స్థానిక విలేకరులతో ఆయన మంగళవారం మాట్లాడుతూ మహిళలందరికీ అంతర్జాతీయ మహిళాదినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మహిళలు ఆర్థిక, సామాజిక, రాజకీయ, పారిశ్రామిక రంగాల్లో రాణించేలా తోడ్పాటునందిస్తున్నారన్నారు. వారసత్వపు ఆస్తిలో పురుషులతో సమానంగా గిరిజన మహిళలకు వాటా ఇవ్వాలన్న అంశంపై 112వ గిరిజన సలహా మండలి సమావేశంలో సమగ్ర చర్చ జరిగిందని, సభ్యులందరూ ఏకాభిప్రాయం తెలియజేశారన్నారు. తదుపరి సమావేశంలో తుదినిర్ణయం తీసుకుని శాసనపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గిరిజన మహిళలకు వారసత్వపు హక్కు కల్పించే విషయంలో దేశంలోనే రాష్ట్ర ప్రభుత్వం ముందంజలో ఉందన్నారు.

ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్ కుమార్

పార్వతీపురం: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా, పకడ్బందీగా నిర్వహించాలని ఉత్తరాంధ్ర జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికల పరిశీలకుడు, రాష్ట్ర సర్వే కమిషనర్ సిద్ధార్థ్ జైన్ అన్నారు. విశాఖపట్నం నుంచి సంబంధిత జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్‌లో మంగళవారం మాట్లాడారు. ఎన్నికల నిర్వహణకు తీసుకున్న చర్యలను కలెక్టర్ నిశాంత్ కుమార్ వివరించారు. పార్వతీపురంలో తాత్కాలిక స్ట్రాంగ్‌రూమ్ ఏర్పాటు చేశామని, పోలింగ్ బాక్సులను విశాఖపట్నం తరలించేందుకు అన్నిచర్యలు చేపట్టామన్నారు. ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు మాట్లాడుతూ జిల్లాలో 8 సున్నితమైన పోలింగ్ కేంద్రాలుగా గుర్తించామని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా రూట్, మొబైల్స్, స్ట్రైకింగ్ ఫోర్సులను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో డీఆర్వో జల్లేపల్లి వెంకటరావు పాల్గొన్నారు.

పోలమాంబకు ప్రత్యేక పూజలు

- అమ్మదర్శనానికి బారులు తీరిన భక్తులు
- అమ్మవారి సేవలో ఎస్పీ దంపతులు



పెదపోలమాంబ అమ్మవారిని దర్శించుకుంటున్న ఎస్పీ దంపతులు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి ఏడవ జాతరకు భక్తులు పోటెత్తారు. అమ్మవారి దర్శనానికి మంగళవారం ఉదయం నుంచి బారులు తీరారు. చదురుగుడి, వనంగుడి క్యూకాంప్లెక్సెలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. చదురుగుడిలో కొలువైన పోలమాంబ అమ్మవారిని దర్శించుకున్నాక, వనంగుడిలో ఉన్న పెదపోలమాంబ అమ్మవారికి పూజలు చేశారు. మొక్కుబడులు చెల్లించారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎస్పీ దంపతులు

శంబర పోలమాంబ అమ్మవారిని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు సతీసమేతంగా దర్శించుకున్నారు. చదురుగుడిలో పోలమాంబ అమ్మవారి ఆలయానికి చేరుకున్న ఎస్పీ దంపతులకు ట్రస్ట్‌బోర్డు చైర్మన్ పూడిదాలినాయుడు, దేవదాయశాఖ సిబ్బంది సాదరంగా స్వాగతించి, అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం వనంగుడిలో ఉన్న పెదపోలమాంబ అమ్మవారిని ఎస్పీ దంపతులు దర్శించుకున్నారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



చదురుగుడి వద్ద భక్తులతో నిండిన క్యూకాంప్లెక్స్

పైడితల్లిని దర్శించుకున్న గానకోకిల

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి అమ్మవారిని మంగళవారం సాయంత్రం గానకోకిల సుశీలమ్మ దర్శించుకున్నారు. అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పైడితల్లి అమ్మవారు నన్ను ఇక్కడ పుట్టించారు. అమ్మ దయతోనే నేను ఉన్నత స్థాయిలో ఉన్నాను. ఆ తల్లి ఇచ్చిన జన్మ ఇది, ఆమెను దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. కాసేపు అంతరాలయంలోనే అమ్మవారిని చూస్తూ... జననీ శివకామినీ... అమ్మవు నీవే..అఖిల జగాలకు అంటూ తల్లిని స్తుతిస్తూ పాడిన పాట ఆద్యంతం భక్తిపారవశ్యంలో ముంచెత్తింది. అనంతరం మన్నార్ రాజగోపాల స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆలయ సూపరింటెండెంట్ ఏడుకొండలు, బి.ఎ.నారాయణరావు, డాక్టర్ జి.సన్యాసమ్మ తదితరులు పాల్గొన్నారు.



సుశీలమ్మకు అమ్మవారి ఆశీస్సులు అందజేస్తున్న అర్చకులు

సర్కారు వారి కానుక

- పేదింటి పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో 25శాతం సీట్లు
- ఈనెల 16 వరకు స్కూల్స్ రిజిస్ట్రేషన్
- 18 నుంచి ఏప్రిల్ 7 వరకు ఆన్‌లైన్‌లో విద్యార్థుల దరఖాస్తు


చదువుతున్న విద్యార్థులు

పార్వతీపురం: పిల్లలను ప్రైవేట్ పాఠశాలలో చదివించాలన్న పేద తల్లిదండ్రుల ఆశ ఫీజులు చెల్లించలేక నీరుగారుతున్న వేళ..ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో వారికి కూడా ప్రైవేట్ స్కూల్‌లో విద్య అందుబాటులోకి వచ్చింది. సమాజంలోని 6 నుంచి 14 ఏళ్ల లోపు పిల్లలంతా చదువుకోవాలనే ఉద్దేశంతో 2009 ఆగస్టు 27న కేంద్ర ప్రభుత్వం 'ఉచిత నిర్బంధ విద్య బాలల హక్కు చట్టం' రూపొందించింది. ఈ చట్టం ప్రకారం ప్రభుత్వ గుర్తింపు ఉన్న ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లను పేద పిల్లలకు ఒకటో తరగతిలో అడ్మిషన్లు ఇవ్వాల్సి ఉంది. వారి ఫీజు మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తుంది. ఎంతో ఉన్నతమైన ఈ చట్టం పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. విద్యా హక్కు చట్టం-2009 కింద ప్రైవేట్ విద్యాసంస్థల్లో 2023-24 విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పేద పిల్లలకు 25 శాతం కోటా అడ్మిషన్ల అమలు పటిష్టంగా చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. పార్వతీపురం మన్యం జిల్లాలో 1007 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు, 218 జెడ్పీ ఉన్నత పాఠశాలలున్నాయి. వాటిలో 70,718 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. అలాగే జిల్లాలో దాదాపు 200 ప్రైవేట్ స్కూళ్లు ఉన్నాయి. ప్రతి ప్రైవేట్ పాఠశాలలోనూ అనాథ, దివ్యాంగ పిల్లలు, హెచ్ఐవీ బాధితుల పిల్లలకు 5 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, బలహీన వర్గాల పిల్లలకు 6 శాతం వెరసి 25 శాతం సీట్లను యాజమాన్యాలు కేటాయించాల్సి ఉంది. ఇందుకు తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.1.44 లక్షలు ఉండాలి. అర్బన్ పరిధిలోని పాఠశాలల్లో ఒక్కో అడ్మిషన్‌కు రూ.8 వేలు, రూరల్ పరిధిలోని పాఠశాలల్లో రూ.6,500 ఫీజును ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ఫీజు మొత్తాన్ని ప్రభుత్వమే ఆయా పాఠశాలలకు చెల్లిస్తుంది. అయితే మన రాష్ట్రంలో 'అమ్మ ఒడి' పథకం ద్వారా ఏటా ఒక్కో విద్యార్థికి రూ.15 వేలు ప్రభుత్వం అందజేస్తోంది. ప్రైవేట్ స్కూళ్లకు ఎంపికైన విద్యార్థులకు 'అమ్మ ఒడి' డబ్బులతోనే ఫీజు చెల్లిస్తారు. మిగిలిన సొమ్మును విద్యార్థి తల్లి/సంరక్షకుల ఖాతాలో జమ చేస్తారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ ప్రభుత్వం జారీ చేసింది.

కిలోమీటర్ పరిధిలోని పాఠశాలలకు ప్రాధాన్యం

విద్యార్థులు నివాసం ఉండే (ఆధార్‌లో చిరునామా ప్రామాణికం) ప్రాంతంలో కిలోమీటర్ పరిధిలో ఉన్న పాఠశాలలకు మొదటి ప్రాధాన్యత ఇస్తారు. ఆ తర్వాత మూడు కిలోమీటర్ల పరిధిలోని పాఠశాలలకు కేటాయిస్తారు. వారి ఇళ్లకు సమీపంలోని పాఠశాలలకు ప్రాధాన్యం ఉంటుంది. ప్రైవేట్ పాఠశాలల అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయితే ఎన్ని పాఠశాలల్లో అడ్మిషన్లు పొందే వీలుంటుందో స్పష్టమవుతుంది.

ఆన్‌లైన్‌లోనే రిజిస్ట్రేషన్

ఈ నెల 16 వరకు ప్రైవేట్ పాఠశాలలు వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఈనెల 18 నుంచి ఏప్రిల్ 7 వరకు అర్హులైన విద్యార్థులు వారి పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి. 9 నుంచి 12 వరకు సచివాలయాల్లో ఉన్న డేటా ద్వారా అర్హులైన విద్యార్థులను గుర్తిస్తారు. 13న లాటరీ ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తారు. 15 నుంచి 21 వరకు ఆయా స్కూళ్లకు విద్యార్థుల అడ్మిషన్లను ఖరారు చేస్తారు. మిగులు సీట్లకు 25న రెండోసారి లాటరీ నిర్వహిస్తారు. 26 నుంచి 30 వరకు ఆయా స్కూళ్లలో అడ్మిషన్ చేయిస్తారు.

పేద పిల్లలకు మంచి అవకాశం



విద్యాహక్కు చట్టం-2009 ద్వారా పేద పిల్లలు ప్రైవేట్ పాఠశాలల్లో చదువుకోవచ్చు. ఇదో మంచి అవకాశం. వారి చదువు ఖర్చును ప్రభుత్వమే భరిస్తుంది. 2023-24 విద్యాసంవత్సరంలో పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. జిల్లాలో గుర్తింపు పొందిన అన్ని పాఠశాలలు రిజిస్ట్రేషన్లు చేసుకునేలా చూస్తాం. విద్యార్థులు వారి ఇంటి సమీపంలోని పాఠశాలలను ఎంపిక చేసుకోవచ్చు.

– ఎస్‌డీవీ రమణ, డీఈఓ, పార్వతీపురం మన్యం జిల్లా

క్లుప్తంగా

పుష్పాలంకరణలో పైడితల్లి


ప్రత్యేక అలంకరణలో పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజామునుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయం వెనుక ఉన్న వేప,రావిచెట్ల వద్ద దీపారాధన చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

12న అండర్-19 జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక

విజయనగరం: జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 12న అండర్ -19 జిల్లా క్రికెట్ జట్టు (బాలురు) ఎంపిక పోటీలు నిర్వహిస్తామని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్ఎన్ రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరంలోని సర్ విజ్జీ స్టేడియంలో ఆ రోజున ఉదయం 7 గంటలకు ఎంపిక పోటీలను నిర్వహిస్తామన్నారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే అభ్యర్థులు 2004 సెప్టెంబర్ 1 తరువాత జన్మించిన వారై ఉండాలని, ఆటగాళ్లు వైట్ డ్రెస్, సొంత క్రికెట్ కిట్‌తో హాజరు కావాలని సూచించారు. అలాగే విజయనగరం జిల్లాలో జన్మించిన జన్మ ధ్రువీకరణ పత్రం, స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డుతో రావాలని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భార్య, పిల్లల మృతి కేసులో భర్తకు జైలుశిక్ష

గంట్యాడ: వరకట్న వేధింపులకు పాల్పడి భార్య, ఇద్దరు పిల్లల మరణానికి కారకుడైన నిందితుడికి 4 ఏళ్ల జైలు, రూ.15 వేల జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. ఈ విషయాన్ని గంట్యాడ ఎస్సై కె.కిరణ్‌కుమార్ మంగళవారం తెలిపారు. మండలంలోని రామవరం గ్రామానికి చెందిన కేవీవీ నరసింహరాజు వరకట్నం కోసం భార్యను వేధించడంతో పిల్లలతో సహా ఆమె ఆత్మహత్యకు పాల్పడింది. ఈ కేసు విచారణ సందర్భంగా అప్పటి గంట్యాడ ఎస్సై, ప్రస్తుత రూరల్ సీఐ తిరుపతిరావు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రస్తుతం అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టులో సాక్షులను విచారించిన తరువాత నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి జె. శ్రీనివాస్‌రావు ముద్దాయికి శిక్ష ఖరారు చేశారు. ఈ కేసులో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాస్ పట్నాయక్ పోలీస్ తరఫున కోర్టులో వాదనలు వినిపించారు.

రోగి మృతిపై విచారణ


విచారణ చేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ రమణ కుమారి

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కొద్ది రోజుల క్రితం ఎస్.కోటకు చెందిన ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటనలో డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్‌వీ రమణకుమారి విచారణ చేపట్టారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే వృద్ధురాలు మరణించిందని ఆమె బంధువులు కలెక్టర్‌కు ఫిర్యాదుచేసిన నేపథ్యంలో డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.వి.రమణ కుమారి ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో మంగళవారం మృతురాలి బంధువులు, రోగి మరణించిన రోజు డ్యూటీలో ఉన్న వైద్య సిబ్బందిని విచారణ చేశారు. ఏవ్యాధితో ఆమె ఆస్పత్రిలో ఉంది, ఏవిధమైన చికిత్స అందించారు, ఆస్పత్రిలో చేర్పించినప్పుడు పరిస్థితి తదితర అంశాలపై ప్రశ్నించారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	56,150-00
బంగారం(22సి. 10గ్రా.)	51,800-00
వెండి (కిలో)	71,200-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹115	₹200	₹ 210

నైపుణ్య కుట్టు శిక్షణ కేంద్రం తనిఖీ


నైపుణ్య కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ జనరల్ మేనేజర్ సీహెచ్ విక్రమ్

గజపతినగరం: వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో ఉద్యోగ ఆధారిత నైపుణ్య కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని భారత డైనమిక్స్ లిమిటెడ్ హైదరాబాద్ డిప్యూటీ జనరల్ మేనేజర్ సీహెచ్ విక్రమ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత్ డైనమిక్స్ లిమిటెడ్ హైదరాబాద్ వారు కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బిలిటి కింద ఈశిక్షణకు అవసరమైన ఆర్థిక సహకారం అందిస్తున్నారన్నారు. విజయనగరం జిల్లాలోని 10కేంద్రాల ద్వారా గ్రామీణ యువతి ఉపాధికి కుట్టు శిక్షణ ఇప్పిస్తున్నట్లు చెప్పారు. కుట్టు శిక్షణ నేర్చుకుంటున్న వారితో మాట్లాడి ఆయా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు ఎలా ఉన్నాయి? ఏవిధంగా అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ మేనేజర్ ఎస్.వి.రమణమూర్తి, ముఖ్యప్రణాళిక అధికారి బాలాజీ, జేడీఎం జాబ్స్, మార్టిన్ లూథర్, స్థానిక ఏపీఎం యు.జగదీష్ కుమార్, మాస్టర్ ట్రైనర్స్ గౌరి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పార్వతీపురం: సీతానగరం మండలం చినభోగిలి గ్రామానికి చెందిన కోరాడ మణి మనస్తాపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటనపై పార్వతీపురం అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయవాడలో ఉంటున్న కోరాడ మణి, కుటుంబసభ్యులు అగ్నిగమ్మ జాతరకు గ్రామానికి వచ్చారు. తలనొప్పి ఉందని మణి మంగళవారం మాత్రలు వేశాడు. అయితే మాత్రలు అధిక మోతాదులో వేయడం గమనించిన కుటుంబసభ్యులు 108 వాహనంలో పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. పార్వతీపురం అవుట్‌పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

టిఫిన్ సెంటర్ దగ్ధం


ప్రమాదానికి గల కారణాలను బాధితుడిని అడిగి తెలుసుకుంటున్న తహసీల్దార్ రామకృష్ణ

లక్కవరపుకోట: మండల కేంద్రంలోని కోమటివీధి సమీపంలో గల పుల్లాన సహదేవకు చెందిన టిఫిన్ సెంటర్ సోమవారం అర్ధరాత్రి ప్రమాదవశాత్తు దగ్ధమైంది. ఎప్పటి మాదిరిగా సహదేవ తన కార్యక్రమాలను పూర్తి చేసుకుని రాత్రి టిఫిన్ సెంటర్ మూసేసి బీసీ కాలనీలో గల ఇంటికి వెళ్లిపోయాడు. అయితే అర్ధరాత్రి ఒక్కసారిగా మంటలు చెలరేగి నిమిషాల్లో టిఫిన్ సెంటర్ పూర్తిగా కాలిబూడిదైయింది.ఈ ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. ఈ సమాచారం మేరకు తహసీల్దార్ టి.రామకృష్ణ సిబ్బందితో మంగళవారం ఘటనా స్థలానికి వెళ్లి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంలో సుమారు రూ.50వేల ఆస్తినష్టం జరిగి ఉండవచ్చని అంచనా వేసి సంబంధిత నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తానని తహసీల్దార్ తెలిపారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ జామి అప్పలరావు తదితరులు ఉన్నారు.

పాత సామగ్రి ఆహుతి


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

గజపతినగరం: స్థానిక కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న స్క్రాప్‌షాప్‌లో గుర్తు తెలియని వ్యక్తులు కాల్చిన బీడీ/సిగరెట్ పడవేయడంతో స్క్రాపషాప్ మంగళవారం సాయంత్రం అగ్నికి ఆహుతైంది. అగ్నికి ఆహుతైన షాప్ బండారు శ్రీనివాసరావుకు చెందిందని అందులో స్క్రాప్‌కు సంబంధించిన పాత సామగ్రిని స్టాకు వేసుకున్నారని అగ్నిమాపక శాఖ అధికారి ఎమ్ఎస్‌వీ రవిప్రసాద్ తెలిపారు. షాప్‌లో మంటలు అకస్మాత్తుగా రావడంతో సమాచారం అందించారన్నారు. దీంతో పక్కన ఉన్న షాపులకు వ్యాపించకుండా సిబ్బందితో వెళ్లి మంటలు అదుపు చేశామని తెలిపారు. కాలిపోయిన సామగ్రి రూ.50వేల విలువ ఉంటుందన్నారు.

గ్యాస్ సిలిండర్ లీక్..


గ్యాస్ సిలిండర్ లీకై వ్యాపించిన మంటలు

భోగాపురం: మండలం కేంద్రంలోని ముక్కాం జంక్షన్ వద్ద సవరం రాంబాబు ఇంట్లో మంగళవారం ఉదయం గ్యాస్ సిలిండర్ లీకై మంటలు వ్యాపించాయి. వెంటనే చుట్టుపక్కల వారు, పోలీసులు అప్రమత్తమై మంటలను అదుపు చేసి గ్యాస్ సిలిండర్ బయటకు తీశారు. దీంతో పెనుప్రమాదం తప్పడంతో చుట్టుపక్కల వారంతా ఊపిరిపీల్చుకున్నారు.

గడ్డివాములు, ధాన్యం..


బాడంగిలో ఆహుతవుతున్న గడ్డివాములు, ధాన్యం

బాడంగి: మండలకేంద్రం బాడంగిలోని మరడానవారి కళ్లంలో మంగళవారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో 8గడ్డికుప్పలు దగ్ధమయ్యాయి. వాటిలోని మూడు గడ్డివాములలో గల సుమారు 50 బస్తాల (250 క్వింటాళ్లు) ధాన్యం కాలిబూడిదయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. మండలకేంద్రంలోని వీరబ్రహ్మంగారి గుడిపక్కనగల మరడాన చంద్రినాయుడు పంటకళ్లంలో ఈ అగ్నిప్రమాదం జరిగింది. అమ్మవారి పండుగ కావడంతో తారాజువ్వలు లేదా ఎవరైన బీడీ, సిగరెట్లు వెలిగించి అగ్గిపుల్ల ఆర్పకుండా పడేసిన కారణంగా గడ్డివాములు తగలబడిపోయాయి, సమాచారం మేరకు డొంకినవలస, రాజాంలనుంచి అగ్నిమాపకదళాలు వచ్చి మంటలను ఆర్పేందుకు కృషిచేశాయి. దీంతో సుమారు రూ.లక్ష వరకు ఆస్తినష్టం జరిగి ఉంటుందని అంచనా వేస్తున్నారు.

జేఎన్‌టీయూ జీవీ చెస్ జట్టు ఖరారు


ఎంపికైన క్రీడాకారులతో వీసీ ప్రొఫెసర్ వెంకటసుబ్బయ్య, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.స్వామినాయుడు

విజయనగరం అర్బన్: ఎస్ఆర్ఎంబీటీ యూనివర్సిటీలో ఈ నెల 10 నుంచి 12వరకు జరగనున్న అంతర్ యూనివర్సిటీ చెస్ పోటీల్లో పాల్గొననున్న జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీ పురుషుల జట్టు ఖరారైంది. ఈ మేరకు యూనివర్సిటీ స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఏవీ పాపారావు మంగళవారం తెలిపారు. ఇటీవల యూనివర్సిటీ అనుబంధ కళాశాలగా ఉన్న ఇంజినీరింగ్ కళాశాల క్రీడామైదానంలో జరిగిన సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో ప్రతిభచూపిన క్రీడాకారులను ఎంపిక చేసినట్లు చెప్పారు. ఎంపికైన క్రీడాకారుల్లో జె.నిఖిలేస్‌రెడ్డి (చైతన్య ఇంజినీరింగ్ కళాశాల), ఎ.కృష్ణవంశీ, ఎల్.సందీప్ (జేఎన్‌టీయూ జీవీ), కె.వినయ్ కుమార్ (సాయి గణపతి ఇంజినీరింగ్ కళాశాల), సీహెచ్ లోహిత్ రెడ్డి (ఎన్ఎస్ఆర్ఐటీ) ఉన్నారు. ఎంపికైన క్రీడాకారులను వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.స్వామినాయుడు, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శ్రీకుమార్ అభినందించారు. అంతర్ యూనివర్సిటీ పోటీలకు శిక్షణ కార్యక్రమాన్ని ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ కె.నాగరాజు, ఎం.ఎల్లారీశ్వరి, టీమ్ మేనేజర్ కె.రాంబాబు నిర్వహించారు.

గుర్తుతెలియని మహిళ మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ ఎం.నాగేశ్వరరావు

బొబ్బిలి రూరల్: మండలంలోని గొర్లెసీతారాంపురం అప్పయ్యచెరువులో మంగళవారం గుర్తు తెలియని మహిళ (45) మృతదేహాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు ఎస్సై చదలవాడ సత్యనారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సమాచారం మేరకు సీఐ ఎం.నాగేశ్వరరావు సిబ్బందితో వెళ్లి, మృతదేహాన్ని పరిశీలించి వెలికితీయించారు. మృతురాలి శరీరంపై ఎలాంటి గాయాలు లేకపోవడంతో అనుమానాస్పద మృతిగా కేసునమోదు చేశారు. కాగా మృతురాలిని బాడంగి మండలం పెద్దపల్లికి చెందిన మహిళగా కొందరు భావిస్తున్నారు. స్థానికంగా ఎలాంటి ఫిర్యాదులు రాలేదని, కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

మాస్‌కాపీయింగ్ వద్దు

- డీఈఓ వెంకటరమణ


సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ వెంకటరమణ

బలిజిపేట: పదవ తరగతి పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వరాదని డీఈఓ ఎస్‌డీవీ రమణ హితవు పలికారు. ఈ మేరకు బలిజిపేట ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థుల ఫేర్‌వెల్ ఫంక్షన్‌కు ఆయన మంగళవారం హాజరయ్యారు. విద్యార్థులు మాస్‌కాపీయింగ్‌కు పాల్పడకుండా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని స్పష్టం చేశారు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడే వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. విద్యార్థులు బాగా చదివి రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో ఉన్నత పదవులు అధిరోహించాలని పిలుపునిచ్చారు. పరీక్షల్లో అన్ని ప్రశ్నలకు జవాబులు రాయాలని సూచించారు. ఒకటే పరీక్ష పేపరు ఉండడం వల్ల ఎంతో ఉపయోగముందన్నారు. ఉపాధ్యాయుడు ఉత్తమమైన బోధన చేస్తే విద్యార్థులు వారిని ఎల్లప్పుడూ గుర్తుంచుకుని గుండెల్లో పెట్టుకుంటారన్నారు. పరీక్షల ముందు ఆరోగ్యంగా ఉండి మంచి విద్యను అభ్యసించి మంచి మార్కులు సాధించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భవిష్యత్తుకు మార్గదర్శకం

పదో తరగతి పరీక్షలు విద్యార్థి దశలో భవిష్యత్తుకు మార్గదర్శకమని పరీక్షల కో ఆర్డినేటర్ రామకృష్ణ అన్నారు. జిల్లా సమగ్ర శిక్ష సెక్టోరియల్ బృందం ఆధ్వర్యంలో మండలంలోని వంతరాం, చిలకలపల్లి ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థులకు ఆయన మంగళవారం సూచనలు అందజేశారు. అందులో భాగంగా వంతరాం కేజీబీవీలో ఆయన మాట్లాడుతూ పదవతరగతి పరీక్షలు రాసేటప్పుడు విద్యార్థులు కొన్ని సూచనలు పాటించాలని చెప్పారు. చదివిన ప్రశ్నలు పరీక్షలో వచ్చినప్పుడు ముందుగా వాటిని తప్పులు లేకుండా, మంచి దస్తూరీతో రాయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఓ రాజారావు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డీసీసీబీ బ్రాంచ్ ఏర్పాటుకు స్థలపరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న సీఈఓ, డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు

వేపాడ: సెంట్రల్ బ్యాంకు బ్రాంచ్ ఏర్పాటుకు సంబంధించిన స్థలాన్ని సిబ్బందితో కలిసి డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకట చిన రామునాయుడు ఆధ్వర్యంలో డీసీసీబీ సీఈఓ కె.జనార్దన మంగళవారం సాయంత్రం వేపాడలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో వేపాడ, మెరకముడిదాం, దత్తిరాజేరు, భోగాపురం, మెంటాడ మండలం చల్లపేట మన్యం జిల్లాలో గరుగుబల్లిలలో కొత్తబ్రాంచ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా సెంట్రల్ బ్యాంకు ఏజీఎం లక్ష్మణరావు, ఇంజినీరింగ్ అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యం

- వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ అవనాపు విక్రమ్


కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకుంటున్న వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ అవనాపు విక్రమ్, డీసీఎంఎస్ చైర్మన్ అవనాపు భావన

విజయనగరం: 2024లో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పని చేస్తానని, పార్టీలో సముచిత స్థానం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటానని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ అవనాపు విక్రమ్ పేర్కొన్నారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు సంబంధించి పార్టీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జిగా తనను నియమించడం పట్ల అవనాపు విక్రమ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన స్వగృహం వద్ద కేక్ కట్ చేసిన అనంతరం బాణసంచా కాల్చిన అభిమానులతో థాంక్యూ సీఎం అంటూ నినాదాలు చేశారు. అనంతరం ఉత్తరాంధ్ర కల్పవల్లి శ్రీ శ్రీ శ్రీ పైడితల్లి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి నాయకత్వంలో ముందుకు వెళ్తామని, తనకు ఈ అవకాశం కల్పించిన పార్టీ నేతలు వైవీ సుబ్బారెడ్డి, వి.విజయసాయి రెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్టీల సంక్షేమంపై ప్రచారం చేస్తా: మాజీ ఎంపీ డాక్టర్ డీవీజీ


వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ డాక్టర్ డీవీజీ

షెడ్యూల్ తెగల సంక్షేమం, అభివృద్ధి, సాధికారత దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై మరింత ప్రభావవంతంగా వైఎస్సార్‌సీపీ తరఫున ప్రచారం నిర్వహించేందుకు తన వంతు కృషి చేస్తానని మాజీ ఎంపీ డీవీజీ శంకర రావు అన్నారు. వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ శ్రీకాకుళం,పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల జోనల్ ఇన్‌చార్జ్‌గా తనను నియమించిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. విద్య, వైద్యం, ఉపాధి కల్పనలో గిరిసీమల్ని ముందు నిలపాలని ముఖ్యమంత్రి చేస్తున్న బృహత్ ప్రయత్నానికి అందరి సంపూర్ణ మద్దతు కూడగట్టి రానున్న ఎన్నికల్లో పార్టీ విజయంలో కీలక పాత్ర పోషిస్తానని చెప్పారు.